




Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com








ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 664 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర బుధవారం 18 ఫిబ్రవరి 2026 పేజీలు : 4 వెల : అమూల్యం




## కమల్ హాసన్ ఎంఎన్ఎం పార్టీకి
# టార్చ్‌లైట్ గుర్తు

బ్యాటరీ టార్చ్‌లైట్ గుర్తును కేటాయిస్తూ ఈసీ నోటిఫికేషన్
పుదుచ్చేరి ఎన్నికల్లో టార్చ్‌లైట్ గుర్తుతో పోటీ
తమిళనాడు ఎన్నికల కోసం ఇంతకుముందే టార్చ్‌లైట్ గుర్తు కేటాయింపు

## ఐఏఎస్ శ్రీలక్ష్మికి
# భారీ షాక్ ఇచ్చిన సుప్రీం

-ఓఎంసీ కేసులో విచారణకు గ్రీన్ సిగ్నల్!
-డిశ్చార్జ్ పిటిషన్‌ను తోసిపుచ్చిన కోర్టు
-పొరపాటును సవరిస్తున్నామంటూ కోర్టు వ్యాఖ్య



# 'ఐబొమ్మ' రవికి బెయిల్ మంజూరు...

ఐబొమ్మ పైరసీ కేసులో ప్రధాన నిందితుడు రవికి బెయిల్-షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేసిన నాంపల్లి కోర్టు
పాస్‌పోర్ట్ స్వాధీనం చేయాలని, దేశం విడవొద్దని ఆదేశం-ఇంటర్నెట్ వినియోగించాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరి
గతంలో రవి బెయిల్ పిటిషన్లను తిరస్కరించిన కోర్టులు



# వైసీపీ నేతల్లారా... సిగ్గుపడండి!:

## మండలిలో అచ్చెన్నాయుడు ఫైర్

లడ్డూ కల్తీని నాటి టీటీడీ చైర్మనే ఒప్పుకున్నారన్న అచ్చెన్న
వైసీపీ నేతలు సిగ్గులేకుండా ఎదురుదాడి చేస్తున్నారని విమర్శ
హెరిటేజ్‌పై ఆరోపణలకు దమ్ముంటే సభలో ఆధారాలు చూపాలని సవాల్
జగన్ డిక్లరేషన్ ఇవ్వకపోవడాన్ని ప్రశ్నించిన మంత్రి
తప్పు చేసిన వారు శిక్ష అనుభవిస్తారని హెచ్చరిక



## అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటాం

-: అయ్యన్నపాత్రుడు

వైసీపీ వాళ్లు గుంతలు తవ్వే రాజకీయాలు చేస్తున్నారని మండిపాటు
సభకు రాకుండా జీతభత్యాలు తీసుకోవడం సరికాదని వ్యాఖ్య



## అందువల్లే డాక్టర్లకు అంత
# గౌరవం లభిస్తోంది:

మంగళగిరి ఎయిమ్స్ స్నాతకోత్సవం-వైద్యులకు దిశానిర్దేశం చేసిన మంత్రి లోకేశ్
వైద్య విద్య పూర్తికావడం నిరంతర అభ్యాసానికి లైసెన్స్ లాంటిదని వ్యాఖ్య
సాంకేతికత సాయం చేసినా, వైద్యుడి స్పర్శలోని స్వస్థత శక్తికి సాటిలేదన్న మంత్రి



సంపద లేదా హోదా వల్ల కాకుండా, జీవితానికి మరణానికి మధ్య నిలబడి ప్రాణదాతలుగా సేవలందించడం వల్లే వైద్యులకు సమాజంలో అత్యున్నత గౌరవం లభిస్తుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. లాభాపేక్షతో కాకుండా మానవత్వంతో సేవలందించాలని, రోగుల నమ్మకాన్ని కూడా తమ విధి నిర్వహణలో భాగంగా మార్చుకోవాలని ఆయన యువ వైద్యులకు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో జరిగిన స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

## చదువుతో పాటు ఆటలు,యోగా
# తప్పనిసరి చేయాలి

- ప్రైవేట్ విద్యార్థుల కోసం 'కామన్ ప్లే గ్రౌండ్ సిస్టమ్' ప్రతిపాదన
-ప్రభుత్వ పాఠశాలల మైదానాలను రుసుముతో వాడుకునే అవకాశం
-విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించి, శారీరక ఆరోగ్యాన్ని పెంచడమే లక్ష్యం
-ఫిట్‌నెస్‌లో మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆదర్శమన్న నాగబాబు



# డిజిటల్ అటెండెన్స్ శాసనమండలిలో ఎందుకు లేదు?: బొత్స సత్యనారాయణ

శాసనసభలో డిజిటల్ అటెండెన్స్ వ్యవస్థను అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఈ వ్యవస్థను శాసనమండలిలో ఎందుకు అమలు చేయడం లేదని వైసీపీ సభ్యుడు బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. మండలి మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ... ఈ అంశంపై ప్రభుత్వం స్పష్టతను ఇవ్వాలని డిమాండ్ చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదంలో పందికొవ్వు, జంతువుల కొవ్వు కలిపారని ప్రచారం చేయడం బాధాకరమని అన్నారు. వాస్తవాలు తేలాలని సుప్రీంకోర్టు సిట్ నియమించిందని చెప్పారు. దర్యాప్తులో కొన్ని ఆశ్చర్యకర విషయాలు, ప్రజలు జీర్ణించుకోలేని నిజాలు వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. టాయిలెట్లలో వాడే కెమికల్స్ లడ్డూలో కలిపారని సీఎం మాట్లాడటం దురదృష్టకరమని, చంద్రబాబు అధికార దాహంతో ఏ స్థాయికైనా వెళతారని బొత్స విమర్శించారు. చంద్రబాబు దోపిడీపై ఎంతవరకైనా పోరాడతామని స్పష్టం చేశా



## పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖపై
# రేవంత్ సమీక్ష

కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఉదయం నుంచి ఫీల్డ్‌లో ఉండాలని ఆదేశం
అడ్వర్టైజింగ్ బోర్డుల నియంత్రణపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచన



సింహగర్జన
www.simhagarjana.com



# చదువుతో పాటు ఆటలు, యోగా తప్పనిసరి చేయాలి

విద్యార్థుల్లో పెరుగుతున్న మానసిక ఒత్తిడిని తగ్గించి, వారిని శారీరకంగా దృఢంగా తీర్చిదిద్దేందుకు విద్యా వ్యవస్థలో కీలక మార్పులు తీసుకురావాలని జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కోన నాగబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ శాసన మండలిలో ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థుల కోసం 'కామన్ ప్లే గ్రౌండ్ సిస్టమ్ (సీజీపీఎస్)' అనే వినూత్న విధానాన్ని ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. ఆటస్థలాలు లేక నాలుగు గోడల మధ్యే చదువుకు అంకితమవుతున్న విద్యార్థుల శ్రేయస్సు కోసం ఈ చర్యలు అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, "పిల్లల్లో ఉండే అపారమైన శక్తిని సరైన మార్గంలోకి మళ్లిస్తే వారు ఉత్తమ పౌరులుగా ఎదుగుతారు. వారంలో కనీసం మూడు రోజులైనా వారికి ఫిజికల్ ఫిట్‌నెస్, ఆటలు, ఇతర సహ పాఠ్యాంశ కార్యకలాపాల్లో శిక్షణ ఇవ్వాలి. ముఖ్యంగా ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివే పిల్లలు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. దీనివల్ల మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఒత్తిడి తట్టుకోలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడిన విషాద సంఘటనలు కూడా ఉన్నాయి. ఆటలు ఆడటం వలన ఈ ఒత్తిడి గణనీయంగా తగ్గుతుంది" అని ఆవేదన వ్యక్తం చేశారు.

చాలా ప్రైవేట్ విద్యాసంస్థలకు సొంతంగా ఆటస్థలాలు లేవని, ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రం విశాలమైన మైదానాలు అందుబాటులో ఉన్నాయని నాగబాబు గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో "కామన్ ప్లే గ్రౌండ్ సిస్టమ్"ను అమలు చేయాలని సూచించారు. ఈ విధానం ద్వారా జిల్లా పరిషత్, మునిసిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లోని మైదానాలను ప్రైవేట్ విద్యాసంస్థల విద్యార్థులు కూడా ఉపయోగించుకోవచ్చని వివరించారు. దీనికోసం ప్రైవేట్ యాజమాన్యాల నుంచి కనీస రుసుము వసూలు చేయాలని, ఆ మొత్తాన్ని సంబంధిత ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుద్ధ్య సిబ్బంది నియామకం, మైదానాల నిర్వహణకు వినియోగించాలని సూచించారు. దీనివల్ల ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల మధ్య సత్సంబంధాలు, అవగాహన కూడా పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

శారీరక దృఢత్వం ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లను ఆయన ఆదర్శంగా చూపారు. "70 ఏళ్ల వయసులో కూడా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు ఎంతో చురుకుగా ఉన్నారు. ప్రతిరోజూ యోగా చేస్తూ ఉత్సాహంగా పరిపాలన సాగిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గారు కీలక శాఖల బాధ్యతలు నిర్వర్తిస్తూనే మార్షల్ ఆర్ట్స్ సాధన కొనసాగిస్తున్నారు. ఇటీవల 'టైగర్ ఆఫ్ మార్షల్ ఆర్ట్స్' అనే అంతర్జాతీయ బిరుదు కూడా పొందారు" అని నాగబాబు ప్రశంసించారు.

"ఇనుప కండరాలు, ఉక్కు నరాలు కలిగిన యువత ఈ దేశానికి కావాలి" అన్న స్వామి వివేకానంద మాటలను ఉటంకిస్తూ, మన విద్యార్థులను కేవలం పుస్తకాల పురుగులుగా కాకుండా శారీరకంగా, మానసికంగా బలమైన యువతగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. చదువుతో పాటు ఫిజికల్ ఫిట్‌నెస్, మార్షల్ ఆర్ట్స్, సెల్ఫ్ డిఫెన్స్, యోగా వంటివి పాఠ్యాంశాల్లో భాగం చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ లను సభ ద్వారా కోరుతున్నానని చెబుతూ నాగబాబు తన ప్రసంగాన్ని ముగించారు.

# అందువల్లే డాక్టర్లకు అంత గౌరవం లభిస్తోంది:

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "ప్రతి ఆసుపత్రి ఆవరణలో ఆందోళన, భయం, బాధ ఉంటాయి. అత్యవసర వార్డులోకి వచ్చే రోగి మీ కళ్లలోకి ఎంతో ఆర్తిగా చూస్తాడు. వారు మీ నుంచి కేవలం మందులనే కాదు, నమ్మకాన్ని, భరోసాను ఆశిస్తారు. మీరు ఇచ్చేది కేవలం ప్రిస్క్రిప్షన్ కాదు, వారిలో చిగురింపజేసే ఆశ. కోవిడ్-19 సమయంలో ప్రపంచమంతా ఇళ్లకే పరిమితమైతే, ప్రాణాలను పణంగా పెట్టి వైద్యులు సేవలందించారు. అందుకే సమాజం మిమ్మల్ని దేవుడి తర్వాత అంతటి వారిగా చూస్తుంది" అని అన్నారు.

దినదినాభివృద్ధి చెందిన మంగళగిరి ఎయిమ్స్

ఈ స్నాతకోత్సవం కేవలం ఒక వేడుక కాదని, విద్యార్థులుగా ప్రవేశించి జీవన సంరక్షకులుగా బాధ్యతలు స్వీకరిస్తున్న పరివర్తన అని లోకేశ్ అభివర్ణించారు.

"ప్రాంతీయ అసమతుల్యతలను సరిదిద్దే జాతీయ ప్రాముఖ్యత కలిగిన సంస్థగా ఎయిమ్స్ భావించబడుతోంది. 2015లో అతి సామాన్యంగా ప్రారంభమైన మంగళగిరి ఎయిమ్స్, నేడు అండర్ గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, సూపర్ స్పెషాలిటీ కోర్సులతో 1,300 మందికి పైగా విద్యార్థులతో ఒక సమగ్ర సంస్థగా ఎదిగింది. కొన్ని పడకల నుంచి నేడు దాదాపు 650 పడకలకు విస్తరించింది. ఓపెన్-హార్ట్ సర్జరీలు, కిడ్నీ మార్పిడి, రోబోటిక్ మోకాళ్ల మార్పిడి వంటి అధునాతన సేవలను అందిస్తోంది. ఈ సంస్థ బోధన, పరిశోధన, రోగి సంరక్షణ అనే మూడు స్తంభాలపై నిలిచి ఉంది. వీటికి 'నమ్మకం' అనే నాలుగో స్తంభాన్ని కూడా మీరు జోడించాలి" అని ఆయన సూచించారు.

ఇప్పటివరకు 45 లక్షలకు పైగా ల్యాబ్, డయాగ్నస్టిక్ సేవలు అందించడం సంస్థ విస్తరిస్తున్న ఆశలకు ప్రతీక అని కొనియాడారు.

మీరే ఈ దేశపు నిజమైన హీరోలు

యువ వైద్యులను ఉద్దేశించి లోకేశ్ మాట్లాడుతూ, "మీరే ఈ దేశపు నిజమైన హీరోలు. సాంకేతికత ఎంత మారినా, కృత్రిమ మేధస్సు (ఏఐ) మీ నైపుణ్యానికి సహాయపడినా.. వైద్యుడి స్పర్శలోని స్వస్థత శక్తికి సాటిలేదు. ఒక్కోసారి మందుల కన్నా మీరిచ్చే భరోసాయే రోగాన్ని నయం చేస్తుంది. డబ్బు చెల్లించలేని రోగిని ఎలా చూస్తారు, నిరక్షరాస్యులకు ఎలా వివరిస్తారనే దానిపై మీ మానవత్వం ఆధారపడి ఉంటుంది" అని అన్నారు. వైద్యులకు వినయం గొప్ప లక్షణమని, గిరిజన ప్రాంతాలను సందర్శించి అక్కడి ఆరోగ్య సమస్యలపై దృష్టి సారించాలని కోరారు.

నైతికతను ఎన్నడూ మరువద్దు

"మీరు అందుకున్న పట్టా వైద్య విద్య పూర్తి చేసిన సర్టిఫికెట్ మాత్రమే కాదు, నిరంతరం నేర్చుకోవడానికి పొందిన లైసెన్స్. డాక్టర్ నేర్చుకోవడం ఆపివేసిన క్షణమే, రోగులు ఇబ్బంది పడతారు. లాభాపేక్షతో మందులు సూచించవద్దు, సౌకర్యం కోసం రాజీ పడవద్దు. మీ వృత్తి మీ హృదయంలోని మానవత్వాన్ని ప్రతిబింబించాలి. ఓటమిని విజయానికి సోపానంగా భావించి, కష్టాలను అధిగమించాలి. తెల్ల కోటు ధరించినప్పుడు దాని గౌరవాన్ని నిలబెడుతూ, రోగులపై ప్రేమతో ముందుకు సాగండి" అని మంత్రి లోకేశ్ ఉద్బోధించారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య, రసాయనాల శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్, మంగళగిరి ఎయిమ్స్ అధ్యక్షుడు మేజర్ జనరల్ డాక్టర్ తపన్ కుమార్ సాహా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ అంతం శాంత సింగ్, అధ్యాపకులు, పట్టభద్రులైన వైద్యులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖపై రేవంత్ సమీక్ష

తెలంగాణలో పురపాలక శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలోకి వెళ్లకపోవడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

సచివాలయంలో ఈరోజు నిర్వహించిన పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖపై సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "కమిషనర్లు, జోనల్ కమిషనర్లు ఉదయం నుంచి ఫీల్డ్‌లో ఉండాలి. పారిశుద్ధ్యం, రోడ్ల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి. రోడ్లు శుభ్రంగా లేకపోతే అక్కడికక్కడే అధికారులను సస్పెండ్ చేస్తాను" అని హెచ్చరించారు.

నూతనంగా ఎన్నికైన మేయర్లు, డిప్యూటీ మేయర్లు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లకు ఒక రోజు శిక్షణ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంఓ సెక్రటరీ మాణిక్ రాజ్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అధికారులకు కీలక సూచనలు చేశారు. నగరంలో స్మార్ట్ పోల్స్ ఏర్పాటుపై అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. ట్రాఫిక్ బాగా ఉన్న చోట్ల పీపీపీ విధానంలో స్కైవాక్ బ్రిడ్జిలు నిర్మించాలని చెప్పారు. నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో మల్టీలెవల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. అడ్వర్టైజింగ్ బోర్డుల నియంత్రణపై జాగ్రత్తలు తీసుకోవాలని... ప్రభుత్వ కార్యక్రమాలకు 10 శాతం బోర్డులు కేటాయించాలని అన్నారు. అనధికార బోర్డులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అడ్వర్టైజింగ్ బోర్డుల నుంచి సంవత్సరానికి ఒకసారి ఫీజు వసూలు చేయాలని సూచించారు. అన్ని పార్కుల వివరాలు సేకరించాలన్నారు.

# కేతకి ఆలయానికి పోటెత్తిన భక్తజనం





ఝరాసంగం)

ఝరాసంగం:దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి.కేతకి ఆలయానికి భక్తజనం పోటెత్తి తరలి రావడంతో కేతకి ఆలయ పరిసరలు శివనామ స్మరణతో మార్మోమోగాయి.మంగళవారం తెల్లవారుజామున అగ్నిగుండం,స్వామి వారికి అభిషేకం,అమ్మవారికి కుంకుమార్చన,రుద్ర సహకార హోమం,పూర్ణాహుతి సాయంత్రం శ్రీ పార్వతి సమ్మేత సంగమేశ్వర వారి కళ్యాణోత్సవం రాత్రి 10-30 గంటలకు స్వామివారి విమాన రథోత్సవం పల్లకి సేవ తదిత కార్యక్రమాలు నిర్వహించారు. కేతకి బ్రహ్మోత్సవాలను మన రాష్ట్రంతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన భక్తులు తరలివచ్చారు.వేలాది మంది భక్తులు స్వామివారి సన్నిధిలో మొక్కులు తీర్చుకున్నారు.కేతకి ఆలయ ఆవరణలో తెల్లవారుజామున అగ్నిగుండాలు ఏర్పాటు చేశారు.భక్తులు ఓం నమశివాయ నామస్మరణలతో అగ్నిగుండంలో నుండి నడిచారు.ఈ అగ్నిగుండంలో నుండి నడిచేందుకు భారీ సంఖ్యలో భక్తులు అగ్నిగుండాల చుట్టూ గుంపులు గుంపులుగా చేరుకొని తిలకించారు.మహోత్సవాలలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ చైర్మన్ చంద్రశేఖర్ సి.ఎఫ్.వో (జాతర పర్యవేక్షకులు) శివరాజ్,



రంగారావు,సారా శీనివాసరావు పూర్తి సౌకర్యాలు కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వినోద బాల్ రాజ్,గ్రామ పెద్దలు, పాలక మండలి సభ్యులు,ఆలయ అర్చకులు,సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

# ఐఏఎస్ శ్రీలక్ష్మికి భారీ షాక్ ఇచ్చిన సుప్రీం

ఓబుళాపురం మైనింగ్ కంపెనీ(ఓఎంసీ) అక్రమ మైనింగ్ కేసులో సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసు నుంచి తనను విముక్తి చేయాలని ఆమె దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింది. గతంలో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ, విచారణను ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేసింది.

సీబీఐ కీలక వాదనలు

ఈ కేసులో శ్రీలక్ష్మి పాత్రపై సీబీఐ కోర్టులో బలమైన వాదనలు వినిపించింది. మైనింగ్ నిబంధనల్లోని 'క్యాప్టివ్ మైనింగ్' అనే పదాన్ని ఉద్దేశపూర్వకంగా తొలగించి, అక్రమాలకు దారులు తెరిచారని సీబీఐ ఆరోపించింది. ఈ అక్రమ వ్యవహారంలో శ్రీలక్ష్మి కీలక పాత్ర పోషించారని, ఆ సమయంలోనే ఆమె మరిది భారీగా అక్రమాస్తులు కూడబెట్టుకున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లింది.

పొరపాటును సవరిస్తున్నాం..

ఈ కేసును విచారించిన జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. "గతంలో ఈ కేసును వేరే కేసుగా భావించి పొరపాటున స్టే ఇచ్చాము. ఇప్పుడు ఆ పొరపాటును సవరిస్తున్నాము. నిందితులు ఆ స్టేను ఇప్పటివరకు ఎంజాయ్ చేశారు" అని ధర్మాసనం పేర్కొంది. దీంతో, శ్రీలక్ష్మి ఇప్పుడు తప్పనిసరిగా కోర్టు విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుందని న్యాయ వర్గాలు చెబుతున్నాయి.

# కమల్ హాసన్ ఎంఎన్ఎం పార్టీకి టార్చ్‌లైట్ గుర్తు

ప్రముఖ సినీ నటుడు కమల్ హాసన్ పార్టీ 'మక్కల్ నీది మయ్యం' (ఎంఎన్ఎం) రాబోయే పుదుచ్చేరి ఎన్నికల్లో పోటీ చేయడం కోసం భారత ఎన్నికల సంఘం బ్యాటరీ టార్చ్‌లైట్ గుర్తును కేటాయించింది. ఈ మేరకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఎన్ఎం పార్టీ టార్చ్‌లైట్ గుర్తుతో బరిలోకి దిగనుంది.తమకు టార్చ్‌లైట్ గుర్తు వచ్చిందని, ఈ గుర్తుపై పుదుచ్చేరిలో పోటీ చేస్తామని పార్టీ ఎంఎన్ఎం పార్టీ మీడియా విభాగం ప్రకటించింది. తమిళనాడులో జరగనున్న ఎన్నికల కోసం ఇంతకుముందే టార్చ్‌లైట్ గుర్తును ఎన్నికల సంఘం కేటాయించింది.ఈ ఏడాది శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గుర్తింపుపొందని రాజకీయ పార్టీలు గుర్తు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల కమిషన్ ఇటీవల కోరిన విషయం తెలిసిందే. దీనితో ఢిల్లీలోని ప్రధాన ఎన్నికల కమిషన్ కార్యాలయంలో ఎంఎన్ఎం పార్టీ పది చిహ్నాలు ఉన్న జాబితాను అందించి, వాటిలో ఒకదానిని కేటాయించాలని కోరింది.

# వైసీపీ నేతల్లారా... సిగ్గుపడండి!:

తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో వైసీపీ నేతలపై ఏపీ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ.. లడ్డూలో కల్తీ జరిగిందని నాటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డే స్వయంగా ఒప్పుకున్నాక కూడా, వైసీపీ నేతలు సిగ్గులేకుండా ఎదురుదాడి చేయడం దుర్మార్గమని మండిపడ్డారు."తప్పు ఒప్పుకున్నాక కూడా బుకాయిస్తారా? వైసీపీ నేతల్లారా సిగ్గుపడండి" అని అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. కోట్ల మంది హిందువుల మనోభావాలను దెబ్బతీసి, పవిత్ర ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వైసీపీకి ధర్మం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని విమర్శించారు. ఈ సందర్భంగా గతంలో జగన్ తిరుమల పర్యటనను మంత్రి గుర్తుచేశారు. హిందూ సంప్రదాయాల ప్రకారం డిక్లరేషన్ ఇవ్వడానికి జగన్ ఎందుకు భయపడ్డారని ప్రశ్నించారు.అంతేకాకుండా, హెరిటేజ్ సంస్థపై అడ్డగోలు ఆరోపణలు చేయడం మానుకోవాలని, దమ్ముంటే కనీసం ఒక్క ఆధారమైనా చూపాలని వైసీపీకి సవాల్ విసిరారు. వ్యవస్థలను భ్రష్టు పట్టించి, హిందూ ధర్మంపై దాడులకు పాల్పడిన ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని అచ్చెన్నాయుడు హెచ్చరించారు. సత్యం గెలిచి తీరుతుందని, తప్పు చేసిన వారు తప్పకుండా శిక్ష అనుభవిస్తారని ఆయన స్పష్టం చేశారు.

# 'ఐబొమ్మ' రవికి బెయిల్ మంజూరు...

సినిమా పైరసీ కేసులో సంచలనం సృష్టించిన 'ఐబొమ్మ' వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇమంది రవికి ఎట్టకేలకు ఊరట లభించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న అతనికి హైదరాబాద్‌లోని నాంపల్లి కోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. గత ఏడాది నవంబర్‌లో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు రవిని అరెస్టు చేసిన విషయం తెలిసిందే.దక్షిణ భారత సినిమాలు, ఓటీటీ కంటెంట్‌ను అక్రమంగా అప్‌లోడ్ చేస్తూ సినీ పరిశ్రమకు వేల కోట్ల రూపాయల నష్టం కలిగించాడనే ఆరోపణలతో రవిపై ఐదు కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో అరెస్టయిన నాటి నుంచి రవి జైల్లోనే ఉన్నాడు. గతంలో అతని బెయిల్ పిటిషన్లను నాంపల్లి కోర్టు, హైకోర్టు తిరస్కరించాయి. తాజాగా మరోసారి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం, కఠిన షరతులతో బెయిల్‌కు అంగీకరించింది.

కోర్టు విధించిన షరతులు పాస్‌పోర్ట్‌ను కోర్టుకు సరెండర్ చేయాలి. ప్రతిరోజూ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసుల ముందు హాజరు కావాలి. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదు. ఇంటర్నెట్ వినియోగించాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.

ఈ నిబంధనలకు కట్టుబడి ఉండాలన్న ఆదేశాలతో రవి జైలు నుంచి బయటకు వచ్చేందుకు మార్గం సుగమమైంది. ఐబొమ్మ సైట్ వల్ల కొత్త సినిమాలు విడుదలైన గంటల్లోనే పైరసీకి గురవుతుండటంతో చిత్ర పరిశ్రమ తీవ్రంగా నష్టపోయింది. ఈ నేపథ్యంలో రవికి బెయిల్ లభించడం కేసులో కీలక పరిణామంగా మారింది

# అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటాం:

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు గంట ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. దీనిపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు మీడియాతో మాట్లాడుతూ... సాఫ్ట్ వేర్ సమస్యే దీనికి కారణమని చెప్పారు. టెక్నికల్ సమస్య వచ్చినప్పుడు ఎవరూ ఏమీ చేయలేరని అన్నారు. వైసీపీ వాళ్లు ఎలాంటి రాజకీయమైనా చేస్తారని... గతంలో ఫేస్ టు ఫేస్ రాజకీయాలు ఉండేవని... ఇప్పుడు వైసీపీ వాళ్లు వెనక నుంచి గుంతలు తవ్వే రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.

సభకు హాజరుకాని వైసీపీ సభ్యుల గురించి మాట్లాడుతూ ఆయన ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత విధులను సక్రమంగా నిర్వహించని ఎమ్మెల్యేలను ప్రజలు రీకాల్ చేయాలని అన్నారు. సభకు రాకుండా జీతభత్యాలు తీసుకోవడం సరికాదని చెప్పారు. విధులకు హాజరుకాని ఉద్యోగులకు జీతం కట్ చేస్తారని... ఆ నిబంధన ఎమ్మెల్యేలకు ఎందుకు వర్తించదని ప్రశ్నించారు. చాలా దేశాల్లో రీకాల్ విధానం ఉందని... మనది ప్రజాస్వామ్య దేశం కావడంతో ఇలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తోందని అన్నారు.

డిజిటల్ అటెండెన్స్ వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తోందని స్పీకర్ తెలిపారు. సభ్యులు అసెంబ్లీకి రావడమే కాదు... సభలో ఎన్ని గంటలు, నిమిషాలు కూర్చున్నారో కూడా ఈ వ్యవస్థ ద్వారా నమోదవుతోందని తెలిపారు.

# శీర్షిక : ఉరితాడు

చీకటి గదిలో నా ఊపిరి
నా హృదయ స్పందనలు లెక్కిస్తున్నాయి
ఉరి తాడు... ఆ ఒక్క తాడు...
నా మెడ చుట్టూ సర్పంలా పొంగుతోంది

రాత్రి కలలో తల్లి ముఖం కనిపించింది
ఆమె కళ్లలో నీళ్లు...
ఎందుకు ఇలా?" అని అడిగింది
నేను సమాధానం చెప్పలేక మౌనంగా


ఆ ఒక్క నిమిషం... ఆ ఒక్క నిమిషంలో
జీవితం మొత్తం ఒక సినిమాలా కనిపించింది
మొదటి అడుగు... మొదటి ప్రేమ...
మొదటి తప్పు...చివరి తప్పు...
ఇప్పుడు ఈ చివరి ఊపిరి

ఎవరో ఒకరు నన్ను తప్పుపట్టారు
ఆ తప్పు ఒక చిన్న మంట...
కాలక్రమేణా అది అడవి మంటై నన్ను కాల్చేసింది
ఇక రేపు సూర్యుడు ఉదయిస్తాడు
పక్షులు పాడతాయి... పిల్లలు ఆడుకుంటారు
కానీ నా కోసం ఎవరూ ఏడవరు
నా శవం కూడా ఎవరికీ గుర్తుండదు

ఓ దేవుడా... ఒక్కసారి మళ్లీ జన్మిస్తే
నా చేతులు ఎవరినీ బాధించనివ్వను
నా నోరు ఎవరినీ తిట్టనివ్వను
నా కాళ్లు తప్పు దారి తొక్కనివ్వను
కానీ ఇప్పుడు ఆలస్యమైపోయింది
తాడు గట్టిగా బిగుసుకుంటోంది
ఊపిరి ఆగుతోంది... హృదయం ఆగుతోంది
కానీ ఈ మనసు... ఇంకా విలపిస్తూనే ఉంది




జీవితం ఎంత విలువైనదో
ఇప్పుడే తెలిసింది... ఇప్పుడే అర్థమైంది
కానీ ఇక ఏమీ చేయలేను
ఉరి తాడు... నా చివరి సాక్షి... నా చివరి శిక్ష
- మీ.. రాము కోలా, దెందుకూరు
ఖమ్మం 9849001201.




# శీర్షిక : చేజారుతుంది....!?

నిజాం ప్రభువుల నుంచి చేజారి
ఆంధ్రా ప్రభువుల చేత చిక్కి
నేడు చిక్కి శల్యమై పోతుంది ఆర్టీసీ
అధికారులకు ఎందుకో దానిపై అంత కసి!?

అద్దె బస్సుల రాకను ప్రోత్సహించడంతో
నైపుణ్యమున్న డ్రైవర్ల నుంచి చేజారి పోయింది
సక్రమశిక్షణా సహిత సంరక్షణను చేజార్చుకుంది!?

సాంకేతికతకు చేయూతనిచ్చే మిషతో
టీమ్ మిషన్లను సంస్థలో ప్రవేశ పెట్టడంతో
అనుభవశీలులైన కండక్టర్లను చేజార్చుకుంది
నిరంతర పర్యవేక్షణను సంస్థ కోల్పోయింది
ఉద్యోగులకు భద్రత చేజారి పోయింది
దిన దిన గండం నూరేళ్ళాయిషులా మారింది!?

సంస్థను ప్రభుత్వం లో విలీనం చేయడం తో
కార్మికులు హక్కులను చేజార్చుకున్నారు

తనిఖీ అధికారులకు కేసులు రాయమని టార్గెట్లు పెట్టడంతో
కార్మికులు ఆత్మస్థైర్యాన్ని చేజార్చుకున్నారు
దొంగలుగా వారి దృష్టిలో సృష్టించబడ్డారు!?

నేడు పర్యావరణ పరిరక్షణ నెపంతో
వాతావరణ కాలుష్య నివారణా మంత్రంతో
సంస్థలో నూతన ప్రవేశం కానున్న విధ్యుత్ బస్సులతో
సంస్థ ప్రభుత్వ పరిధుల్లోంచి అనధికార వ్యక్తుల
కబంధ హస్తాల్లోకి చేజారి పోతుంది
తాంబూలాలైచ్చాము తన్నుకు చావండి చోద్యం
చూస్తున్న ప్రభుత్వ చర్యలతో
సంస్థ మనుగడే చేజారి పోయేలా ఉంది!?

చేయి చేయి కలిపి
యూనియన్లకు అతీతంగా
కార్మికులమందరం సమైక్యమై
ఐక్య పోరాటాలు కొనసాగించైనా
చేజారి పోనున్న ఆర్టీసీని చేజిక్కించుకుందాం!
భావితరాలకు ఆర్టీసీని సజీవంగా అందిద్దాం!
జై ఝజూంతీషె అని నినదిద్దాం!!!

# అద్వానంగా మారిన సర్పంచుల పరిస్థితి - పట్టించుకోని అధికారులు

చందర్లపాడు, సింహగర్జన ప్రతినిధి , ఫిబ్రవరి 17 : గగ్గోలు పెడుతున్న సర్పంచులు, అడ్డగోలుగా ఎదుగుతున్న కంప్యూటర్ ఆపరేటర్, ఈ కంప్యూటర్ ఆపరేటర్ కి అండగా నిలుస్తున్న గ్రామ సెక్రెటరీ మరియు అధికారులు. చందర్లపాడు మండలంలోని సర్పంచులు నెల నెల తనకి పరిహారం చెల్లించకపోతే వారు చేసిన బిల్లులు ఆపేసే పరిస్థితి మారింది. ఇక ఒక కంప్యూటర్ ఆపరేటర్ నెలసరి ఆదాయం సుమారు లక్షల్లో ఉంటుంది. చందర్లపాడు మండలంలోని సర్పంచుల పరిస్థితి అద్వానంగా ఉన్న పట్టించుకోని అధికారులు. మండలంలోని సర్పంచులు వారి గ్రామాల్లో చేసిన పనులకు బిల్లులు పెట్టాలన్నా, పెట్టిన బిల్లులు కార్యరూపం దాల్చాలన్న కంప్యూటర్ ఆపరేటర్ ప్రమేయం లేకుండా ఏదీ జరగదు. అక్కడ ఇక ఒక్కొక్క సర్పంచ్ వద్ద నుండి ప్రతి నెల 4000/- రూపాయలు వసూలు చేస్తున్నారు. కాంట్రాక్ట్ బేసిక్ మీద చేరిన ఒక కంప్యూటర్ ఆపరేటర్ నెలసరి ఆదాయం లక్షల్లో ఉందంటే ఎవరికైనా నమ్మశక్యంగా ఉంటుందా...? కానీ కొన్ని వాస్తవాలు చేదుగానే ఉంటాయి

# సమస్యల పరిష్కారానికి కృషి



మునగాల, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 17 : గ్రామంలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని సర్పంచి కుంచం ఇందిరా నర్సయ్య అన్నారు. మునగాల మండలంలోని నర్సింహులగూడెంలో గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్ఫార్మర్ లో స్థానంలో నూతన స్తంభాలు ట్రాన్స్ఫార్మర్ లను ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. అలాగే గ్రామస్థుల సహకారంతో మరింత అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సీతారాములు, వార్డు సభ్యులు, విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థుల తదితరులు పాల్గొన్నారు

## పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

వలేటివారిపాలెం
ప్రత్యేక తరగతుల నిర్వహణతో పాటు విద్యార్థులు పరీక్షలకు సంసిద్ధులను చేసే దశగా చర్యలు తీసుకొని ఉత్తమ ఫలితాలను సాధించాలని సమగ్ర శిక్షణ సీఎంవో రమణయ్య సూచించారు జమీన్ ఉప్పలపాడు లో కేజీబీవీ పాఠశాలను జిల్లా కమిటీ మంగళవారం సందర్శించారు 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ 100 రోజులు కార్యక్రమం అమలు తీరు పై సిబ్బంది విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు అకడమిక్ లో తీసుకున్నా చర్యలను ద్రస్తాలను పరిశీలించారు ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు హాజరు కావాలని విద్యార్థులకు చెప్పారు ఉపాధ్యాయులు సూచనలను తప్పనిసరిగా పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నరు ఈ కార్యక్రమంలో రసూల్ సమీర్ ప్రత్యేక అధికారి అరుణ తదితరులు పాల్గొన్నారు

## శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయం నిర్మాణం కోసం 5,116 రూపాయలు విరాళం

గుడ్లూరు. : గుడ్లూరు మండలం చెమిడిదపాడు గ్రామ బస్టాండు వద్ద నిర్మాణంలో ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆలయం నిర్మాణం కోసం గుడ్లూరుకు చెందిన తోడెళ్ల గోత్రం ,చుండి అనిల్ కుమార్, ధర్మపత్ని ఉదయ కుమారి , కుమారుడు అఖిల్, కుమార్తె నాగ దివిత, లు 5,116 రూపాయలు విరాళం అందించారు. ఆలయ నిర్మాణం ప్రాంగణంలో స్వామి వారి సన్నిధిలో ట్రస్ట్ అధ్యక్షులు ఆలూరి వెంకట హనుమంతరావు కు అఖిల్ ఆ మొత్తం అందించారు.మంగళవారం ఉదయం జరిగిన వాలాగ్ర పూజ లో, అష్టోత్తర శతనామావళి పూజ లో పాల్గొన్నారు. విరాళం అందించిన అనిల్ కుమార్ కుటుంబ సభ్యులకు ఆ సీతా రామ లక్ష్మణ భరత శత్రుజ్ఞ పరివార దేవత సమేత శ్రీ సువర్చలా పంచముఖ ఆంజనేయ స్వామి వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకుంటూ ట్రస్ట్ తరపున హనుమంతరావు కృతజ్ఞతలు తెలిపారు.

# అండర్ బ్రిడ్జి వేస్తాము అని చాకిచర్ల రైల్వే గేట్ మూసివేత ఇబ్బందులు పడుతున్న ఆయా గ్రామ ప్రజలు

ఉలవపాడు, , ఫిబ్రవరి:-17
ఉలవపాడు మండల, చాకిచర్ల గ్రామం, చాగొల్లు సమీపంలో ఉన్న రైల్వే గేట్ వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తామని రైల్వే గేట్ మూసివేయడం జరిగింది. అనంతరం చుట్టు ప్రక్కల ఉన్న ప్రజలు ఆందోళన దిగు సమయానికి ఉలవపాడు పోలీసు, సిబ్బంది అక్కడికి చేరుకొని వారికీ నచ్చ చెప్పి ఆందోళనకు దిగకుండా చూడడం జరిగింది. అనంతరం 11 గంటల సమయంలో కందుకూరు సి ఐ. అన్వర్ భాషా, మండల తహసిల్దార్. టి. శ్రీనివాసులు, ఆర్ పి ఎఫ్. ఎస్ ఐ, ఎస్ఎస్ఇ, రైల్వే. పి వి ఎన్ ఎల్, ప్రతినిధులు, ఉలవపాడు పోలీస్ సిబ్బంది, చాకిచర్ల సచివాలయంలో చాకిచర్ల రైల్వే గేట్ మూసివేత సమస్య పై జరిగిన చర్చలకు హాజరయ్యారు. చాకిచర్ల, చాకిచర్ల పెద్ద పట్టపుపాలెం, చాగల్లు, రామాయపట్నం, గ్రామాల నుండి ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. మౌలికంగా మరియు రాతపూర్వకంగా తమ ప్రాతివిధ్యాన్ని సమర్పించారు. రైల్వే అధికారులు తాత్కాలికంగా పనిని ఆపేస్తామని హామీ ఇచ్చారు. సమస్య తాత్కాలికంగా పరిష్కరించబడింది. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ టీ శ్రీనివాసులు, సి ఐ.అన్వర్ భాషా, స్థానిక ఎస్సై జి. సుబ్బారావు, రైల్వే ఆర్పిఎఫ్, ఆర్ వి ఎన్ ఎల్ ప్రతినిధులు, మరియు చుట్టూ ప్రక్కల గ్రామ ప్రజలు పాల్గొన్నారు.





# కాలబైరవస్వామికు పూజలు వేలాదిమంది భక్తులు రాక

సింగరాయకొండ,
సింగరాయకొండ మండలంలోని బిట్రగుంటలో కొలువు తీరి ఉన్న శ్రీ కాల భైరవఆలయంలో మంగళవారం పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు, హోంమాలను నిర్వహించారు. తమ మొక్కుబడులను చెల్లించి గుమ్మడికాయలనువెలిగించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ఒంగోలు ,నెల్లూరు తదితర జిల్లాలనుంచి వేలాదిమంది భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడుపర్యవేక్షించారు. భక్తులకు వసతులను కల్పిస్తూ సేవకులను నియమించి అన్నదాన కార్యక్రమశీకు భక్తులు హాజరయ్యారు. జాతీయ రహదారీపైనే ఆటోలు, కార్లు, తదితర వాహనాలను నిలిపేశారు. సింగరాయకొండ సిఐ చావా హాజరత్తయ్య ఆధ్వర్యంలో సిబ్బంది ఎలాంటి ఇబ్బందులను లేకుండా రాకపోకలు వెళ్లే విధముగా చర్యలను చేపట్టారు.

# తలసేమియా బాధిత చిన్నారులకు ఉచిత గుండె పరీక్షలు


## 2డి ఎకో స్కాన్ పరీక్షలు నిర్వహించిన ప్రముఖ చిన్నపిల్లల గుండెవ్యాధి నిపుణులు డా. ఆర్ జ్యోతి ప్రకాష్ రెడ్డి



కావలి,
గుంటూరు రమేష్ హాస్పిటల్స్ కు చెందిన ప్రముఖ చిన్నపిల్లల గుండెవ్యాధి నిపుణులు మంగళవారం రెడ్ క్రాస్ తలసేమియా డే కేర్ సెంటర్ లో తలసేమియా బాధిత చిన్నారులకు 2డి ఎకో స్కాన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా తలసేమియా మెడికల్ ఆఫీసర్ మరియు ప్రముఖ చిన్నపిల్లల వ్యాధి నిపుణులు డాక్టర్ పి శ్రీధర్ మాట్లాడుతూ, తలస్సేమియా బాధిత చిన్నారులకు తరచూ, రక్తం ఎక్కించడం వలన శరీరంలో ఐరన్ నిల్వలు పెరిగే అవకాశం ఉన్నందున వారికి శరీరంలోని ఐరన్ బయటకు వెళ్ళడానికి మందులు ఇస్తామని, దానితోపాటు ప్రతీ ఆరు నెలలకు గుండెకు సంభందించిన 2డి స్కాన్ పరీక్షలు చేయవలసిన అవసరం ఉందని అన్నారు. తన మిత్రులు, ప్రముఖ చిన్న పిల్లల గుండెవ్యాధి నిపుణులు డాక్టర్ ఆర్. జ్యోతి ప్రకాష్ రెడ్డి తన ఖర్చులతో గుంటూరు నుండి వచ్చి, ఒక్కొక్కరికి మూడు వేల రూపాయలు ఖర్చు అయ్యే వైద్య పరీక్షలను 16 మందికి ఉచితంగా చేసారని అన్నారు. మిగతా వారికి అవసరమైనప్పుడు చేస్తారని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జ్యోతి ప్రకాష్ రెడ్డిని రెడ్ క్రాస్ బాధ్యులు ఘనంగా సత్కరించారు.
కావలి పట్టణంలోని వ్యాపార ప్రముఖులు కొత్త సత్యనారాయణ తన మనమడు ఆశ్రీత్ జన్మదినాన్ని తలసేమియా చిన్నారుల మధ్య నిర్వహించుకోవడంతో పాటు, తలసేమియా కేంద్రం నిర్వహణకు 10 వేల రూపాయలు విరాళం అందజేశారు. విశ్రాంత బ్యాంకు అధికారి రమణారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొని, తలసేమియా కేంద్రం నిర్వహణకు ప్రతీ నెలా నాలుగు వేల ఐదు వందల రూపాయలు జీవితాంతం ఇస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ పాలకమండలి సభ్యులు డాక్టర్ బెజవాడ రవికుమార్, డి రవిప్రకాష్, కె హరినారప రెడ్డి, కలికి శ్రీహరి రెడ్డి, బెజవాడ ప్రసన్నకుమార్, గొట్టిపాటి మనోరమ, ఏ రమేష్ రెడ్డి ( రోటరీ క్లబ్ అధ్యక్షులు ), జూనియర్ రెడ్ క్రాస్ కన్వీనర్ జి హరనాథ్, తలసేమియా కేంద్రం పోషక సభ్యులు మార్కండేయలు, సీతరామయ్య, ఇంజనీర్ అలహరి శ్రీనివాసకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్ (2026) ఫలితాలలో అద్భుత ఫలితాలు సాధించిన శ్రీ గాయత్రి ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు

కందుకూరు, :
సోమవారం విడుదలైన జేఈఈ మెయిన్స్ సెషన్-1 ఫలితాల్లో కందుకూరు శ్రీ గాయత్రి ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థి కొనిదెన ధనుష్ 97.584, నెక్కంటి రాకేష్ 91.6312 పర్సంటేజ్ తో అత్యుత్తమ ఫలితాలు సాధించినట్లు గాయత్రి విద్యాసంస్థల అధినేత సిహెచ్ రామకృష్ణారావు మరియు డైరెక్టర్ సిహెచ్ భరద్వాజ్ తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను వారి తల్లిదండ్రులను, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బందిని శ్రీ గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ సిహెచ్ రామకృష్ణ రావు ,కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వి ఉషా చంద్రిక , ఐఐటి అకాడమీ డీన్ ×. వెంకటేశ్వర్లు,జి1 క్యాంపస్ డీన్ పాతూరి వెంకటేశ్వర్లు అభినందించారు.






# నలదళపూరులో క్షేత్రదినోత్సవం రైతులకు సిబ్బందికి శిక్షణ

వలేటివారిపాలెం,



27 వ పొగాకు బోర్డు పరిధిలోని నలదలపూరులో మంగళవారం సిరి - ఎఫ్ సి ఆర్-15 వంగడాల మధ్య ఉత్పత్తి, నాణ్యతలో పోలిక అనే అంశం మీద రైతులకు, సిబ్బందికి శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వేలం నిర్వహణ అధికారి బి.చంద్ర శేఖర్ మాట్లాడుతూ అడుగు ఆకులు వొదిలేసి పక్వానికి వచ్చిన వాటిని మాత్రమే రెలచాలి అని అన్నారు. ఆకు అల్లిక సమయంలో టార్పాలిన్ పట్టాలు విడిగా వాడాలి అన్నారు. గ్రేడింగ్ సమయంలో బుట్టలను అందుబాటులో ఉంచుకొని అన్యపదర్థాలను అందులో వేయాలని చెప్పారు. బారన్లో కురోమీటర్ఉపయోగించాలన్నారు. దీనివలన అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. బ్యారెన్ లో క్యురింగ్ సమయంలో తీసుకోవలసిన మెలుకువలు, క్యూరింగ్, గ్రేడింగ్ అప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు,పొగాకులో అన్యాపదర్థాలు కలవకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి రైతులకు సవివరంగా వివరించారు.సీనియర్ గ్రేడింగ్ ఆఫీసర్ రాజా గోపాల్ మాట్లాడుతూ శాస్త్ర సాంకేతికత వైపు దృష్టి సాధించాలని సూచించారు. మరియు ప్రస్తుత పరిస్థితులతో పంటలలో తీసుకోవలసిన జాగ్రత్తలును సూచించారు. ఐ.టి.సి ప్రతినిదులు విజయ్ కుమార్ గారు మాట్లాడుతూ సిరి ఫీఎ= -15 వంగడాల మధ్య పోలికలు గురించి క్లుప్తంగా వివరించారు ,జి.పి.ఐ ప్రతినిధి సుబ్బా నాయుడు మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెట్లో ఉన్న ఓడి దుడుకులు గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు సిబ్బందులు, నలదళపురు రైతులు పాల్గొన్నారు

# హనుమాన్ విగ్రహం మీద వానరం



కందుకూరు, : కందుకూరు మండలం ఓగూరు గ్రామంలో అమావాస్య మంగళవారం రోజున అద్భుత సన్నివేశం చోటుచేసుకుంది. హనుమాన్ విగ్రహం మీద వానరం కూర్చుని ఆంజనేయ భక్తులకు, ప్రజలకు కనువిందు చేసింది. హనుమాన్ విగ్రహం మీద వానరం కూర్చుని ఉండటంతో ఆ సన్నివేశాన్ని చూసిన హనుమాన్ భక్తులు ఒకింత భక్తి పర్వశానికి లోనయ్యారు.అది మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన రోజు కావడంతో స్వామి వారి భక్తులు ఎంతో సంతోషం చెందారు.

# ఐఐటీ..జేఈఈ..మెయిన్స్ అడ్డ నక్షత్ర ఐఐటీ జేఈఈ అకాడమీకందుకూరు గడ్డ.

కందుకూరు,
ఉమ్మడి ప్రకాశం జిల్లా విద్యా వ్యవస్థలో సంచలన విజయాలకు కేరాఫ్ అడ్రస్ "నక్షత్ర ఐఐటీ జేఈఈ అకాడమీ.. కందుకూరు". సోమవారం ప్రకటించిన జేఈఈ మెయిన్స్ సెషన్ -1 2026 పరీక్షా ఫలితాల్లో మెజారిటీ మన ప్రభుత్వ పాఠశాలలో చదివిన సాధారణ విద్యార్థులతో అసాధారణ ర్యాంక్ సాధించి జాతీయ మరియు రాష్ట్ర స్థాయిలలో అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన మన "నక్షత్ర ఐఐటీ జేఈఈ అకాడమీ"కందుకూరు విద్యార్థినీ విద్యార్థులు.



సి.వై.యశ్వంత్ -- 97.63%,
ఎస్.భరద్వాజ-- 96.70%,
వై.చరణ్--- 93.73%,
కె.వి.వర్షిణి... 91.76%,
జి.ప్రణతి... 91.69%,

ఈ సందర్భంగా కళాశాల ఆవరణలోని జరిగిన కార్యక్రమంలో.. నక్షత్ర జేఈఈ అకాడమీ.. డైరెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో నక్షత్ర ఐఐటీ జేఈఈ అకాడమీ విద్యాసంస్థకు గుర్తింపు తీసుకురావటానికి సహకరించిన మా విద్యార్థినీ విద్యార్థులకు, పేరెంట్స్ వారి శ్రేయోభిలాషులకు మరియు ఈ ఉత్తమ ఫలితాలు సాధించుటకు నిరంతరం కృషిచేసిన మా అధ్యాపకులు,అధ్యాపకేతర సిబ్బంది కి అభినందనలు తెలియజేస్తూ,మాకు అన్నివేళలా సహకరిస్తున్న ఆత్మీయులైన మా కళాశాల యాజమాన్యము కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నక్షత్ర ఐఐటీ జేఈఈ అకాడమీ డైరెక్టర్ పి.శ్రీనివాసులు , అధ్యాపకులు మరియు అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

# 3442 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

గుడ్లూరు,
జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలో అన్ని ప్రాథమిక పాఠశాలలు, హై స్కూల్స్, అంగన్వాడీ కేంద్రములందు 1-19 సంవత్సరముల వయసు కలిగిన పిల్లలందరికీ నులిపురుగులు నివారించుటకు ఆల్బెండజోల్ 400ఎస్త్ర మాత్రలను పంపిణీ చేయటం జరిగినది మండలంలో 3442 మంది పిల్లలకు ఈ మాత్రలను ఇవ్వడం జరిగినది.



ఈ కార్యక్రమంలో భాగంగా గుడ్లూరు హైస్కూల్ నందు డాక్టర్ ఎల్ సాయి ప్రియాంక , డాక్టర్ రమ్య పిల్లలకు మాత్రలు పంపిణీ చేయడం జరిగింది. నుల్లిపురుగుల వలన పిల్లలు పౌష్టికాహార లోపము రక్తహీనతతో బాధపడుతూ ఉంటారు.ఈ మాత్ర తీసుకొనటం వలన శరీరంలోని ను ల్లిపురుగులను నివారించి రక్తహీనత నుండి పిల్లలను కాపాడువచ్చని తెలియజేశారు. వారు ఆరోగ్యంగా మరియు చదువుపై ధ్యాస ఉంచుటకు దోహదపడతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెడ్మాస్టర్ రామ్మోహన్ రావు ఉపాధ్యాయులు,వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగినది



# గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి

## -జిల్లా కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు,
ఉగాది నాటికి నిర్దేశించిన లక్ష్యం మేరకు గృహ నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన ప్రకాశం భవనం నుంచి మున్సిపల్ కమిషనర్లు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హౌసింగ్, సచివాలయాల సేవలు, యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, పారిశుద్ధ్యము, స్వమిత్వ సర్వే, ఇంటి పన్నుల వసూలు, అక్షర ఆంధ్ర, విద్యా, వైద్యం, డ్వామా, పంచాయతీరాజ్ పనులపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జన్మన్, పి.ఎం.ఏ.వై.-2.0 పథకం కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలలో కూడా వేగం పెంచాలని స్పష్టం చేశారు. సచివాలయాల సిబ్బందితో చేయిస్తున్న సర్వేలను కూడా ఈ నెలాఖరు నాటికి ముగించాలన్నారు. ఇంటి పన్నుల వసూలులో లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. పదవ తరగతి విద్యార్థులకు హెల్త్ చెకప్స్ చేయాలని, వారిని పబ్లిక్ పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసేలా ఎంఈఓలు తమ పరిధిలోని పాఠశాలలను రెగ్యులర్గా సందర్శించాలని ఆయన చెప్పారు. అక్షర ఆంధ్ర కార్యక్రమంపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కేటాయించిన నిధులను సమర్థంగా వినియోగించుకునేలా పెండింగ్ పనులను పూర్తి చేయాలని పంచాయతీరాజ్, డ్వామా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ హౌసింగ్ పిడి శ్రీనివాస ప్రసాద్, జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ వెంకటేశ్వరరావు, డీఈవో రేణుక, ఆర్.ఐ.ఓ. ఆంజనేయులు, డిఎంహెచ్వో వెంకటేశ్వర్లు, డ్వామా పీ.డీ. జోసఫ్ కుమార్, పంచాయతీరాజ్ ఎస్.ఈ. అశోక్, డిఆర్డిఏ పిడి నారాయణ, సిపిఓ సుధాకర్ రెడ్డి, సచివాలయాల నోడల్ ఆఫీసర్ సువార్తమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కందుకూరు టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నులిపురుగుల నివారణపై అవగాహన



కందుకూరు,
కందుకూరు పట్టణంలోని టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) వేదికగా మంగళవారం నాడు జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్.ఎస్.ఎస్. విభాగం మరియు రెండవ సచివాలయం వైద్య ఆరోగ్య సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు నులి పురుగుల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, ముఖ్యంగా రక్తహీనత మరియు ఎదుగుదల లోపాలను వివరించడంతో పాటు, వ్యక్తిగత పరిశుభ్రత పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవి కుమార్ పాల్గొని ప్రసంగిస్తూ, విద్యార్థుల శారీరక ఆరోగ్యం వారి విద్యాభ్యాసంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని, అందుకే ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆరోగ్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ కోటపాటి నరేష్ రాజా మరియు రెండవ సచివాలయం వైద్య ఆరోగ్య సిబ్బంది సుధాకర్ మరియు కళ్యాణి సమక్షంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, వైద్య సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



# విధాత సినిమాను ఆదరించండి

## - పోలోజు రాజ్ కుమార్ ఆచార్య

హైదరాబాద్ , సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 17 : తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ జాతీయ అధ్యక్షుడు, విశ్వకర్మ ముద్దుబిడ్డ డాక్టర్ అప్పినపల్లి భాస్కరాచారి చిత్ర నిర్మాతగా తీసిన సినిమా 'విధాత' ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ పలు పోరాటాల రూపంలో విధాత అడుగు పెడతాడు, తప్పు చేసిన వారిని శిక్షిస్తాడు, పేదవారి పక్షాన బలహీనవర్గాల పక్షాన నిలబడతాడు అలాంటి గొప్ప సినిమా విధాత అని తెలుగు వెలుగు సాయికి వేదిక జాతీయ సూచన సేవా సంస్థ చైర్మన్ పోలోజు రాజ్ కుమార్ ఆచార్య అన్నారు. మంగళవారం సిద్దిపేటలో తెలుగు వెలుగు సాహితివేదిక ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందించబడి, ప్రేక్షకుల్లో స్ఫూర్తి నింపేలా ఉంటుందని, ఇలాంటి చిన్న చిత్రాలకు తెలుగు రాష్ట్రల ప్రభుత్వాలు కూడా సహకారం అందించాలని, ఈ సినిమా త్వరలోనే థియేటర్లలో విడుదల కానుంది. చిత్రాన్ని చూసి ఆదరించి విజయవంతం చేయాలని వీరికి మీడియా మిత్రులు, ప్రేక్షకులు సపోర్ట్ చేయాలని, చిత్ర యూనిట్ కి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు సంగ శ్రీధర్, రాష్ట్ర మీడియా కన్వీనర్ జొనగోని యాదగిరి గౌడ్, రాష్ట్ర కార్యదర్శి ప్రముఖ కవి రచయిత వేముల తిరుపతిరెడ్డి, బాణాల రాజుచారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బి.సి బాలుర వసతిగృహములో తల్లి దండ్రులు విద్యార్థులతో సమావేశం

కావలి,
కావలి వెంగళ రావునగర్ లోని ప్రభుత్వ బి. సి బాలురహాస్టల్ నందు,కావలి డివిజన్ సహాయ బి.సి సంక్షేమాధికారి అరుణమ్మఅధ్యక్షతన,వసతి గృహ సంక్షేమాధికారి, బండికోటి చలపతిరావు ఆధ్వర్యంలోతల్లిదండ్రులు,వసతి గృహ విద్యార్థులతో సమావేశం జరిగింది.
పై కార్యక్రమంలోముఖ్యంగా10 తరగతి విద్యార్థులకు త్వరలో జరుగబోవు పబ్లిక్ పరీక్షలలో, తీసుకోవలసిన,జాగ్రత్త లుగురించి,వసతి గృహ సంక్షేమాధికారులు,తల్లిదండ్రుల పాత్ర,పాఠశాల ఉపాధ్యాయులు,తీసుకోవలసిన జాగ్రత్తలు, మెరుగైన ఫలితాలు,సాధించే దిశగా,తగుసూచనలు, సలహాలుఇచ్చి,అవగాహన,ధైర్యాన్ని నింపడమైనది.అతిదులు ప్రసంగిస్తువిద్యార్థులు భావి భారత పౌరులుగ,ఎదగాలని, విద్యతో వస్తుంది వివేకం... వివేకం తెస్తుంది సౌభాగ్యం,తల్లిదండ్రులు మీ బిడ్డలను ఉన్నత స్థితికి, ఎదుగుటకు,మీ వంతు ప్రయత్నం చేయాలని,10వ తరగతి పరీక్షలు పూర్తి అయినంత వరకు మీ పిల్లలను మీ స్వగ్రామమునకు రప్పించ కూడదని సూచించారు,ఎక్కడ విద్య విరాజిల్లుతుందో అక్కడ అభివృద్ధి తాండవిస్తుందిఅని,మీ బిడ్డలు అన్ని రంగాల్లో రాణించుటకు,మీకు మంచి పేరు ప్రతిష్టలు,పొందాలన్న ఒక విద్య తోనే సాధ్య మౌతుందిఅనితెలిపారు,ప్రభుత్వవసతిగృహాలలో,మంచి సదుపాయాలు లభిస్తున్నాయిఅని,ప్రభుత్వం 10వ తరగతి విద్యార్థులకొరకు, విద్యాభివృద్ధికి, ఇంగ్లీష్, గణిత శాస్త్రం, సైన్స్, హిందీ, సబ్జెక్టు లందు ట్యూటర్లనుఏర్పాటు చేసి,అన్ని సౌకర్యములు కల్పిస్తున్నారని , విద్యార్థులు సద్వినియోగం చేసుకొని, మంచి ఫలితాలు సాధించాలని కోరారు.పై కార్యక్రమం లో...ముఖ్య అతిధులు విశ్రాంత వసతి గృహ సంక్షేమాధికారి ఎాఖ. బాష,మేధా జూనియర్ కాలేజీ కరెస్పాండంట్,పి. జానకిరామ్.ఉపాధ్యాయులు, శ్రీనివాసులు, బ్రహ్మారెడ్డి, సంక్షేమాధికారి, శ్రీకాంత్, ట్యూటర్లు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైభవంగా భద్రకాళి సమేత వీరభద్రుని కళ్యాణం

తర్లుపాడు
తర్లుపాడు గ్రామంలో వెంచేసి వున్న శ్రీ భద్రాఖాళీ సమేత వీరభద్రుని ఆలయంలో ఆలయ సింగిల్ ట్రస్ట్ చైర్మన్ నేరెళ్ల సాంబశివరావు ఆధ్వర్యంలో స్వామి వారి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు, ఉభయ దాతలు గా నేరెళ్ల కుమార్ దంపతులు, నేరెళ్ల కార్తీక్ దంపతులు వ్యవహరించారు వేద పండితులు ఓరుగంటి శ్రీరామ్ శర్మ, ఓరుగంటి పవన్ కుమార్ శర్మ రంగానాద శర్మ , ఆర్ ఎస్ శర్మ,కృష్ణశర్మ,భార్గవ్ శర్మ .మంత్రోత్సరణ నడుమ శ్యాస్త్రోత్తంగా భద్రకాళీ, వీరభద్రస్వామివారి ప్రాశస్త్యాన్ని వేద పండితులు భక్తులకు వివరించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలకు తరలివచ్చిన భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది. దీంతో ఆలయంలో భక్తులకు ప్రసాద వితరణతో పాటు అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహించారు.
ఆలయ కల్యాణ మండపంలో వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ దేవతామూర్తుల అర్చకులు కల్యాణ ఘట్టం పూర్తి చేశారు. దీంతో భక్తులు ఆ అపూర్వ ఘట్టాన్ని దర్శించుకుని పులకరించిపోయారుఈ కార్యక్రమం లో గ్రామ పెద్దలు వేణుగోపాల స్వామి ధర్మకర్త జవ్వాజి విజయ భాస్కర రావు, పోలేపల్లి జనార్దన్, వాడేల కృష్ణ ప్రసాద్,ఈర్ల వెంకటయ్య, వెలుగు కాశీరావు,కాళంగి శ్రీనివాసులు,వెన్నా రాజా రామ్ రెడ్డి, కొలగట్ల భాస్కర్ రెడ్డి, కొలగట్ల కాశీశ్వర రెడ్డి బేడుదూరి పుల్లయ్య, కొలగట్ల నారాయణరెడ్డి, కుందురు చిన్న కాసిరెడ్డి, జవ్వాజి వెంకటేశ్వర్లు, చినమన గొండ సుబ్రహ్మణ్యం గర్రె మురళి తదితరులు మహిళా భక్తులు పాల్గొన్నారు









Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com